



కడియం సత్యదేవ నర్సరీలో సంక్రాంతి సందర్భంగా పూల మొక్కలతో అలంకరణ

యథేచ్ఛగా కోడిపందేలు

- పోలీసుల హెచ్చరికలు బేఖాతరు
- పలు మండలాల్లో పందేల నిర్వహణ
- జోరుగా గుండాట, జూదం
- రూ.5 వేల నుంచి రూ.10 వేలు పలికిన కోస


కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో ఏర్పాటుచేసిన బరిలో తలపడుతున్న కోళ్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సంక్రాంతి పండగ సందర్భంగా పలుచోట్ల ఏర్పాటుచేసిన బరుల్లో ఆదివారం కోడిపందేలు యథేచ్ఛగా జరిగాయి. కోడిపందేలతో పాటు గుండాట, జూదాలు కూడా నిర్వహించారు. రూ.లక్షలు చేతులు మారాయి. మద్యం అమ్మకాలు జరిగాయి.

కాట్రేనికోన పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ మండలంలో గ్రామ గ్రామాల్లో కోడిపందేలు యథేచ్ఛగా ప్రారంభమయ్యాయి. కాట్రేనికోన మండలంలో చెయ్యేరు, గెద్దనపల్లి వెల్లపాలెం తదితర గ్రామాల్లో బరులు వెలిశాయి. కోడిపందేలతో పాటుగా గుండాటలు, జూదాల నిర్వహణ కూడా కొనసాగుతోంది. కోడి పందేలు, గుండాటల వద్ద జనం జాతరను తలపిస్తున్నారు. రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. పోరాడి ఓడిన కోడికి భారీ డిమాండ్ నెలకొంది. పందెంలో ఓడిపోయి చనిపోయిన కోడిని కోస అంటారు. కోసలను కొనేందుకు మాంస ప్రియులు ఎగబడ్డారు. ఒక్కో కోస రూ.5వేలు నుంచి రూ.10వేలు వరకు భారీ ధర పలికింది. అలాగే **ఆత్రేయపురం** మండలంలోని బొబ్బర్లంక, పేరవరం, వసంతవాడ, నార్కెడిమిల్లి, ర్యాలి, లొల్ల, గ్రామాల్లో కోడిపందేలు, గుండాట, జూదాలు జోరుగా సాగాయి. **మామిడికుదురు** పోలీసుల ఆంక్షలు బేఖాతరు జిల్లా వ్యాప్తంగా జోరుగా కోడిపందేలు గుండాట, పేకాట భోగి రోజున జోరందుకున్నాయి. బరుల అనుమతి కోసం రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. బరుల వద్ద మద్యం యేరులై పారుతోంది. **ఉప్పలగుప్తం** మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా ఆదివారం విచ్చలవిడిగా కోడిపందేలు గుండాటలు నిర్వహించారు. ఉప్పలగుప్తం, పెదగాడవిల్లి, ఎస్.కొత్తపల్లి, ఎస్.యానాం, చల్లపల్లి, భీమనపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో బాహాటంగా కోడి పందేలు గుండాటలు జరుగుతున్నా పోలీసులు కన్నెత్తి చూడలేదు. **కపిలేశ్వరపురం.** మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, వెదురుమూడి,కోరుమిల్లి, తదితర గ్రామాల్లో నిర్వాహకులు విచ్చలవిడిగా కోడిపందేలు, గుండాటలు, నిర్వహించారు. **రామచంద్రపురం** సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, గుండాటలు నిర్వహించారు. రామచంద్రపురం పట్టణంలోని బైపాస్ రోడ్, శీలం వారి సవరం, తాళ్ల పొలంలో, హసన్‌బాదలో, ఎల్లంపేటవద్ద, కె. గంగవరం మండలంలోని పామర్రు కాళ్ళ సరిహద్దు లోను, పేకేరు గ్రామం లోను, ఆదివిరంగా బాలాంతరం, మసకపల్లి, బోడిలంకలోనూ కోడిపందేలు గుండాటలు జరిగాయి.


ఉప్పలగుప్తంలో జరుగుతున్న గుండాట


కాట్రేనికోన మండలం గెద్దనాపల్లిలో పందేల వద్ద చేతులు మారుతున్న నగదు


గెద్దనాపల్లిలో పందేల వద్ద నిలిపిన కారులు


అమలాపురంలో భోగిమంటల్లో ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసన

ప్రజాశక్తి-అమలాపురం

ఉద్యమాల పట్ల ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర యుటిఎఫ్ సంఘం పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతులను దహనం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ప్రతులను భోగిమంటల్లో వేశారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంటివిఎఎస్.సుబ్బారావు, జిల్లా కార్యదర్శులు టి.దుర్గాప్రసాద్, పి.శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శులు ఎ.సురేష్ కుమార్, కాకిలేటి సురేష్, బియన్.వేంకటేశ్వరరావు, సిహెచ్.హరిబాబు, టి.బాలాజీ, ఈశ్వరరావు, బియన్.శివకుమార్, కె.సత్య, కె.రేణుకాప్రసాద్, షేక్ సత్తార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

ఉద్యోగుల ఉపాధ్యాయులకు చెల్లించవలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలని జిల్లా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటివి.సుబ్బారావు డిమాండ్ చేశారు.యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని ప్రాంతాలలో ఉద్యోగులు ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ నిర్లక్ష్య ప్రజాస్వామ్య వైఖరిని ఖండిస్తూ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ భోగిమంటలలో పత్రాల దహనం కార్యక్రమంలో భాగంగా అమలాపురం స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో జరిగిన కార్యక్రమాలు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా పిఆర్‌సి, డిఎ, సరెండర్ లీవ్, ఎపి జిఎల్ఐ, పిఎఫ్ బకాయిలు సుమారు రూ.18వేల 96 కోట్లు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. ఉద్యోగుల ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్ములను కూడా అవసరాలకు విడుదల చేయకుండా అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు . జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ యుటిఎఫ్ పోరాట ఫలితంగా పిఎఫ్ లోన్లు జమ చేయటం జరిగిందని,మరి మిగిలిన బకాయిల మాటేమిటి,పిఆర్సీ పరిస్థితి ఏమింటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో జనవరి 19 డివిజన్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, జనవరి 24 జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలను చేపడతాం అని ప్రకటించారు.

27 పథకాల పునరుద్ధరణకు డిమాండ్

ప్రజాశక్తి -మామిడికుదురు

దళితులకు రాజ్యాంగబద్ధంగా రావల్సిన 27 పథకాలను పునరుద్ధరించాలని దళిత సంఘల నేతలు ఆదివారం ఈదరాడ సిద్ధార్థ పేటలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లి శ్రీనివాస్ అధ్యతన రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల దళిత సంఘాలనే నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రద్దుచేసిన పథకాలు పునరుద్ధరించిన తరువాతే విజయవాడలో 125అడుగుల విగ్రహన్ని ఆవిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బత్తుల జనార్దన్, కలిగితి పల్లంరాజు, నూటుకుర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటలతో అంగన్‌వాడీల నిరసన


మండపేటలో సమ్మె శిబిరం వద్ద భోగిమంట వేసిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్ల సాధన కోసం గత 34 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీల కొనసాగుతోంది. ఆదివారం జిల్లాలో అంగన్‌వాడీలు భోగిమంటలు వేసి నిరసన తెలిపారు.

అమలాపురం సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివానం కలెక్టరేట్ ఎదుట భోగి మంటలు వేసి రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. కోనసీమ ప్రాంతంలో సంక్రాంతి పండగ ఘనంగా నిర్వహించుకుంటామని అలాంటి సంక్రాంతి పండగకు సీఎం జగన్ తమను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, పి.అమూల్య, విజయ, సుబ్బలక్ష్మి, పరిపూర్ణ, పార్వతి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.**మండపేట** స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా శిబిరం వద్ద భోగిమంట వేసి నిరసన తెలిపారు. జగనన్న మాకు పండగ దూరం చేసి ఆకలితో పస్తులు ఉంచాడని నినాదాలు చేపట్టారు. అనంతరం

34వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

పలువురు అంగన్‌వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేది లేదన్నారు వెంటనే వేతనాలు పెంచుకున్నట్లు మరో జిఒ ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ , సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు..లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయలి. ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలన్నారు. సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 33 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో మండపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **మామిడికుదురు** మామిడికుదురు లో అంగన్వాడీలనిరవదిక సమ్మె లో భాగంగా బోగి పండగ రోజైనఆదివారం శిబిరం వద్ద ముగ్గులు, బోగిమంటలు వేచి నిరసన తెలిపారు.సి ఎం తమను ప్రధాన పండగకు దూరం చేశారని వారు వాపోయారు. **ముమ్మిడివరం** నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం అవరణ లో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు దుర్గా మహేశ్వరి జయలక్ష్మి అద్వర్యంలో జరుగుతున్న సమ్మెలో భాగంగా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన భోగిమంటలలో జి.ఓ.నెం.2 ఎస్మా ప్రతులను ధగ్నం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ వేతనాలు పెంచేదాకా సమ్మెను విరమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.


అమలాపురంలో కలెక్టరేట్ ఎదుట భోగి మంట వేస్తున్న అంగన్‌వాడీలు, పాల్గొన్నకారెంవెంకటేశ్వరరావు

సంక్రాంతి సందర్భంగా అంగన్‌వాడీలు శిబిరం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన వారికి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటలక్ష్మి, నాగరత్నం, విజయ కుమారి, అంజలీదేవి, యశోద తదితరులు పాల్గొన్నారు.**రామచంద్రపురం** రామచంద్రపురం, కె.గంగవరం మండలాల అంగన్‌వాడీలు మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా మెయిన్ రోడ్డుపై భోగి మంటలు వేసి నిరసన తెలిపారు అనంతరం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, అంగనవాడీ జిల్లా కార్యదర్శి దుర్గమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వీరలక్ష్మి మాట్లాడారు. సమ్మెకి సిపిఐ నాయకులు ఉండవల్లి గోపాలరావు, కృష్ణ, పి. రాము, రవి, స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి రామరాజు మద్దతు తెలియజేశారు. అంగన్‌వాడీ సమ్మెశిబిరంలో పిల్లలకు భోగి పండ్లు పోసినారు.సమ్మెలో అంగనవాడి నాయకులు వాసంశెట్టి సూర్యకుమారి, విజయలక్ష్మి, .శ్రీదేవి, జహరా, దుర్గ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.


రామచంద్రపురంలో భోగి మంట వేసి అంగన్‌వాడీల నిరసన, పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు తదితరులు


భోగి మంటలో ఎస్మా ప్రతులు వేసిన 'ముమ్మిడివరం' అంగన్‌వాడీలు


మామిడికుదురులో భోగి మంట వేసి అంగన్‌వాడీల నిరసన

జిఒ నెం.1 కాపీల దహనం

ప్రజాశక్తి-మండపేట

పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నాయకులు చేపట్టే కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెంబర్ వన్ కాపీల ప్రతులను ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు భోగిమంటలో వేసి దద్దం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి జిఒలు ఎన్ని తీసుకువచ్చిన భయపడదిలేదన్నారు. ప్రజా హక్కుల కోసం నిరంతరం ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం తీసుకురావడం ప్రభుత్వ నిరంకుశ తత్వానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, చేకూరి రమేష్ రాజు, వాకచర్ల గుప్తా, తెల్లాకుల వేణుగోపాల్ పాల్గొన్నారు. **కొత్తపేట** వైసిపిప్రభుత్వం అరాచకాల ప్లకార్డులు భోగిమంటల్లో వేసి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగేలా కోరుకోవాలని కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు అన్నారు. టిడిపి ఆదేశాల మేరకు జగన్ ప్రభుత్వ అరాచకాలకు నిరసనగా భోగిమంటలో నిరసన పత్రాలను, జిఒ కాపీలను వేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ సూర్యుడు మకరంలో ప్రవేశించడంతో సంక్రాతి ఏర్పడితే పండగ వాతావరణం వస్తుందని జగన్ ప్రభుత్వం ఇంటికి పోయిన రోజే రాష్ట్ర ప్రజలకు నిజమైన పండగ వస్తుందని సత్యానందరావు అన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ కలసి ముక్తకంఠంతో కీడు పోవాలి, ఎపి వెలగాలి అంటూ నినాదాలు చేస్తూ భోగి సంకల్పం కార్యక్రమంలో పాల్గొన్నారు.


కాపీలప్రతులు భోగిమంటలో వేసిన మండపేట ఎంఎల్ఎ


కొత్తపేటలో ప్లే కార్డులను మంటలో వేస్తున్న బండారు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పత్రాల దహనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నురద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రామచంద్రపురం లో సిపిఐ నాయకులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ప్రతినిధులు కలిసి ఆదివారం భోగిమంటల్లో జిఒ కాపీలను దహనం చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజవర్గ కార్యదర్శి పెద్దిరెడ్డి రాము, కార్యవర్గ సభ్యులు న్యాయవాదుల ప్రతినిధి వర్గం వి.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు. జిఒను వెంటనే ఉపసంహరించుకోవాలంటూ నినాదాలు చేశారు.

కార్టూ'నిజం'



ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం పలు చోట్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ వేషధారణలు, డూడూబసవన్నలు, రంగవల్లులు, భోగిమంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.చిన్నారులకు భోగిపండ్లు పోశారు. పలుచోట్ల భోగి మంటల్లో భోగి దండలు వేశారు.

ఆత్రేయపురం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సంక్రాంతి సంబరాలు ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి సాంప్రదాయ దుస్తులతో స్వామి దర్శించుకున్నారు అనంతరం భోగి మంట వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. **ఉప్పలగుప్తం** భీమనపల్లిలో మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి సభ్యురాలు నాగరత్నకుమారి దంపతుల కుటుంబం ఇంట ఆదివారం పిల్లలతో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల పిల్లలతో ఇంట్లో బొమ్మల కొలువు నిర్వహించి, చిన్నారుల తలపై భోగి పండ్లు వేశారు. **కపిలేశ్వరపురం** మండలంలో భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు తెల్లవారుజామున స్నానమాచరించి నూతన దుస్తులు ధరించి, భోగి దండలను భోగిమంటల్లో మంటలు వేశారు..ప్రతి ఇంటి ముందు రంగురంగుల రంగవల్లులు పలు ఆకతుల్లో దర్శనమిచ్చాయి. **మామిడికుదురు** మొగలికుదురులో స్థానికులు తయారు చేసిన 100అడుగుల భోగి పిడకల దండ ఆకర్షణగా నిలిచింది. **కొత్తపేట** స్థానిక కాపు కళ్యాణమండపంలో సంక్రాంతి వేడుకలు పండుగలను నిర్వహించారు ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాలలో నిర్వహించే సంస్కృతి కార్యక్రమాలను బండారు సత్యానందరావు పర్యవేక్షణలో నిర్వహించారు ఆదివారం మహిళ ముగ్గుల పోటీలు సంస్కృతి కార్యక్రమాలు పాల్గొన్న ప్రతి ఒక్కరికి విజేతలకు బహుమతులను అందజేశారు కేరళ వాయిద్యాలు, కాంతారామ్ డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు, పిండివంట పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు భోగి పండుగను మండలంలోని ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు.


మామిడికుదురు మండలం మొగలికుదురులో భోగిదండతో చిన్నారులు


ఆత్రేయపురం మండలం వాడపల్లిలో సంక్రాంతి సంబరాలు

సముద్ర తీరంలో కైట్ ఫెస్టివల్

అమలాపురం(అల్లవరం) అల్లవరం మండలం ఓడలరేవు సముద్రతీరాన కైట్ ఫెస్టివల్‌ను వ్యవస్థాపక అధ్యక్షులు తాడి ధర్మారావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అమలాపురం తాలూకా అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షులు కొల్లు సత్యనారాయణమూర్తి కైట్ ఫెస్టివల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ కార్యక్రమం 8 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నామని, కొంతమంది దాతలు సహకారంతో పర్యాటకులకు రెండు వేల మందికి భోజనం, మంచినీరు వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రధాన దాతఅయిన పెమ్మాడి రమేష్ కైట్ ఫెస్టివల్ నిమిత్తం 2000 పతంగులను ఉచితంగా అందిస్తున్నారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ విలియమ్స్, కమిటీ మెంబర్ పాల వెంకటేశ్వరరావు, సోమాని రమణ, కలిగితి ఏసురత్నం, తారాడి ఉమామహేశ్వరరావు, తాడి ధనుంజయ , ఉపాధ్యాయులు మధుర లక్ష్మణ్ బాబు కొల్లు సత్యరాజు తదితరులు పాల్గొన్నారు


ఉప్పలగుప్తం మండలంల భీమనపల్లిలో చిన్నారులకు భోగిపండ్లు



కొత్తపేటలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన

సంప్రదాయ కొలువు..కోనసీమ ప్రభ

- ఎపిలో అతిపెద్దవైన వాకలగరువు, తొండవరం ప్రభలు
- నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన జగ్గన్నతోట ప్రభల తీర్థం



అప్పర కౌశిక దాటుతున్న గంగలకుర్రు అగ్రహారం ప్రభ

ప్రజాశక్తి - అంబాజీపేట

కోనసీమలో సంస్కృతి, సంప్రదాయాల కొలువు కోనసీమలో పైరు పచ్చని తివాచీలంటి వరిచేలు స్వాగతించే కొబ్బరి చెట్ల నడుమ నేలకు దిగొచ్చిన ఇంద్రధనస్సులా ప్రభల తీర్థాలు సాగుతాయి. సంక్రాంతి ప్రభల తీర్థాలకు కోన సీమ ముఖ్య వేదిక అయినప్పటికీ అంబాజీపేట మండలంలో జగ్గన్నతోట, వాకలగరువులో జరిగే ప్రభల తీర్థాలు రాష్ట్ర, జిల్లాల వ్యాప్తంగా ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

జగ్గన్నతోట ప్రభల తీర్థం

అంబాజీపేటలో మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. కోనసీమలో జరిగే ప్రభల ఉత్సవాలలో అతి పెద్దది ఇది. ఒక్కడ ఏకాదశ రుద్రులు లోక కళ్యాణార్థం కొలువు తీరుతాయని ఈ ప్రాంత ప్రజల విశ్వాసం స్థానికంగా ఉన్న భోగేశ్వర స్వామి ఆలయంలోని రాగి శాసనాన్ని బట్టి చరిత్రాత్మక ప్రాముఖ్యత ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎలాంటి గుడి, గోపురము లేకుండా ఏడు ఎకరాల కొబ్బరితోటలో తీర్థం నిర్వహిస్తారు. ఈ ప్రాంతాన్ని జగ్గన్నతోటగా పిలుస్తారని చరిత్ర ఆధారాలని బట్టి తెలుస్తోంది.

సుందరం.. ఆహ్లాదకరం

మొసలపల్లిలో భోగేశ్వరస్వామి పిలుపు మేరకు గంగలకుర్రు అగ్రహారంలో వీరేశ్వరస్వామి, గంగలకుర్రులో చెన్నమల్లేశ్వర స్వామి ప్రభలు వరి చేల నుంచి అప్పర కౌశిక్ ను దాటుకుంటూ వచ్చే సుందర దృశ్యాలను చూసేందుకే రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా పోటీ పడుతుంటారు. అప్పటికే నారుమడులు నాట్లు వేసిన పంటచేలను తొక్కుకుంటూ ప్రభలను తీసుకొచ్చే దశ్యం మేనకేశ్వర జగ్గన్నతోట అప్పర్ కౌశిక్ దాటుతున్న ప్రభల ఆహ్లాదకరమైనది. మేనకేశ్వర స్వామి(కె.పెదపూడి), వ్యాఘేశ్వర స్వామి (వ్యాఘేశ్వరం), ఆనంద రామేశ్వరస్వామి(ఇరుసుమండ), కాశీ విశ్వేశ్వస్వామి (వక్కలంక), చెన్న మల్లేశ్వరస్వామి(నేదునూరు), రాఘవేశ్వరస్వామి (ముక్కామల), మల్లేశ్వరస్వామి (పాలగుమ్మి), అభినవ వ్యాఘేశ్వర స్వామి (పుల్లేటికుర్రు) గ్రామాల నుంచి ఇలా 11 ప్రభలు కొలువుతీరే తీర్థాన్ని చూసేందుకు తరలి వస్తారు. అన్ని ప్రభల కంటే ముందుగా మొసలపల్లి ప్రభ కొలువుదీరి ఆహ్వానం పలుకుతోంది. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసే ప్రభలలో వాకలగరువు, తొండవరం ప్రభలు గుర్తింపు పొందాయి. వాకలగరువు రావిచెట్టు సెంటర్‌లో వాకలగరువు 53 అడుగులు, తొండవరం 51, గున్నేపల్లి 32 అడుగుల ఎత్తు ప్రభలు ఉంటాయి.

గత ఏడాది గణతంత్ర వేడుకల్లో

దేశ రాజధాని ఢిల్లీ లో గత ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌కు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జగ్గన్నతోట ఏకాదశి రుద్రుల ప్రభల శకటం రాష్ట్రపతి చే ప్రశంసలు అందుకుంది. ఈ ప్రభల తీర్థం తిలకించేందుకు సుదూర ప్రాంతాల్లో ఉన్న ఈ ప్రాంత వాసులు సంక్రాంతి సందర్భంగా స్వగ్రామాలకు చేరుకుని ఆత్మీయ సహచరు లతో సమావేశాలు నిర్వహించుకోవడం జరుగుతుంది.

ఆత్మీయత అనురాగాలు ప్రతిబింబిస్తాయి

క్షణం తీరిక లేకుండా బిజీబిజీ జీవితం గడిపే పట్టణ వాసులకు



ఎత్తయిన వాకలగరువు ప్రభ

సంక్రాంతి పండగ ఆత్మీయత అనురాగాలు మెరుగుపరుచుకోవడానికి దోహదపడుతుంది.

సంక్రాంతి సంబరాల్లో ..

సంక్రాంతి సంబరాలలో రెండు ఎద్దుల బళ్లు, ప్రభలు తీర్థాలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ఆకర్షణగా నిలుస్తాయి. ప్రభల తీర్థాలు ఆనాటి పల్లె జీవనాన్ని గుర్తుచేస్తాయి.

ప్రభల తీర్థాలకు పటిష్టమైన బందోబస్తు



మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో, వాకలగరువుల్లో జరిగే ప్రభల తీర్థాలకు కొత్తపేట డిఎస్‌పి పర్యవేక్షణలో, పి.గన్నవరం సిఐ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశాం.తీర్థాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ప్రబల ఉత్సవాలు జరుపుకోవాలి.

–ఎ.చైతన్య కుమార్ , ఎస్ఐ, అంబాజీపేట

నేడు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి–కొత్తపేట

కొత్తపేటలో నిర్వహించే ప్రభల తీర్థం సందర్భంగా ఈ క్రింది విధంగా ట్రాఫిక్ మళ్లించడమైందని డిఎస్‌పి వెంకటరమణ ఆదివారం ప్రకటనలో తెలిపారు రావులపాలెం మీదుగా వచ్చే వాహనాలు బోడిపాలెం వంతెన నుంచి వాడపాలెం మీదుగా అయినవిల్లి వైపు, అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపు వెళ్లే వాహనాలు పలివెల వంతెన నుంచి గంటి మీదుగా రావులపాలెం వైపు మళ్లించడమైందన్నారు. వాడపాలెం దేవి సెంటర్ నుంచి కొత్తపేట వైపు వాహనాలు నిషేధించడమెందన్నారు. ఎటువంటి వాహనాములు కొత్తపేట ఊర్లోకి అనుమతి లేదు.మంగళవారం నుంచి యథావిధిగా రాకపోకలు జరుగుతాయని ఈవిషయం కొత్తపేట పరిసర ప్రాంత ప్రజలందరికీ తెలియజేయడమెందన్నారు.

గాయాలతో గుర్తు తెలీని వ్యక్తి మృతి

ప్రజాశక్తి–ఆలమూరు



ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన మతిస్థిమితం లేని, గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ మాట్లాడుతూ 216ఎ జాతీయ రహదారిపై చెముడులంక వద్ద ఈ నెల 5న ఒక మతి స్థిమితం లేని వ్యక్తి డివైడర్ దాటుతూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. నాటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి యొక్క పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసినవారు సెల్ నెం.94409 04849కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి–ఆలమూరు



పంపిణీ చేస్తున్న పాపారావు

మండల కేంద్రానికి చెందిన పారిశ్రామిక వేత్త, దాత వంటిపల్లి పాపారావు ఆదివారం సంక్రాంతి వేడుకలలో భాగంగా భోగి సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సంపాదనలో కొంత మేర ఆపన్నుల అవసరాలు తీరుస్తూ తో సంతృప్తి పొందుతున్నానన్నారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



బాలబాలాజీ అన్న దాన ట్రస్ట్ విరాళం ఇచ్చిన దాతకు చిత్ర పటం అందిసున్న ఛైర్మన్

ప్రజాశక్తి–మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ శాశ్వత నిత్యాన్నదానట్రస్ట్‌కు ఆదివారం దాతలు విరాళాలు అందజేశారు. రాజమహేంద్రవరం వాసులు జొన్నలగడ్డ వెంకట రామదాసు ఇందుమతిల జాపకార్థం ప్రతీ ఏటా ముక్కోటి ఏ కాదశి రోజున అన్నదానం జరిపించేందుకు వారి కుమారుడు సోమశేఖర్, నాగమణి దంపతులు ఆదివారం అన్న దానట్రస్ట్ కు రూ.1,00,116) విరాళం గా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంది మాధవి తెలిపారు. దాతలకు ఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకష్ణ స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

గోదాదేవి కల్యాణం

బాల బాలాజీస్వామి సన్నిధి లో ఆదివారం సంక్రాంతిని పురస్కరించుకొని భోగి మంటలతో, హరిదాసు, ముగ్గులు, ఎడ్ల బండి తో, చెరుకులతో అలంకరణ చేసి పొంగలితో సాంప్రదాయంగా. సాంస్కతిక కార్యక్రమములు, ఏర్పాటుచేశారు. తదుపరి గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం యాత్రికులచే కార్యక్రమములోఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకష్ణ మరియు.. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారిణి గ్రంధి మాధవి పాలుగున్నారు.

ఫోటో. అన్న దాన ట్రస్ట్ విరాళం దాతకు చిత్ర పటం అందిసున్న ఛైర్మన్

నేడు ' స్పందన' కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి–అమలాపురం

ఈ నెల 15న మకర సంక్రాంతి పండగ సెలవు దినం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ కార్యా లయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని వారు ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని పల్లంకుర్రు లో పేకాటలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు ట్రైనీ డిఎస్‌పి ఆధ్వర్యంలో కాట్రేనికోన పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. 22మంది పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్దనుండి రూ.1,42,810 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేశ్వరావు తెలిపారు

1100 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడి ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ పి.సునీల్‌కుమార్ పర్యవేక్షణలో ఆదివారం రౌతులపూడిలో చేసిన దాడుల్లో 1100 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటు సారాను ఐదుగురు వ్యక్తులు నిల్వ చేసి ఉంచినట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడిల్లో ఎస్ఐ అబ్దుల్ నబి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుక

ప్రజాశక్తి - యానాం



భోగి వేడుకల్లో రామన్న కోడు గ్రామస్తులు

యానాం పరిధిలోని పలు గ్రామాల్లో భోగి పండుగ వేడుక ఘనంగా జరిగాయి. ప్రతి వీధిలోను భోగి మంటల వద్ద పిల్లల కేరింతలతో మంటల్లో పిడకల దండలు వేస్తూ ఆనందాన్ని పొందారు. స్థానిక రామన్నకోడు గ్రామంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నెల రోజులపాటు తెల్లవారు జామున భజనలను చేసిన నిర్వాహకులు ఆదివారం ముగింపు సందర్భంగా వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ప్రత్యేక భజనలు చేశారు.

100 మంది మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - కరప

కాకినాడకు చెందిన సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మందికి చీరలు పంపిణీ చేశారు. భోగి పండుగను పురస్కరించుకుని స్థానిక మెరక వీధి రామాలయం వద్ద ఆదివారం కరప గ్రామానికి చెందిన నిరుపేదలకు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, నక్కా భద్రం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నక్కా సత్యనారాయణ, నక్కా శ్రీను బాబు, పాట్నీడి సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

డివైఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వరహాలయ్య పేట, సత్తెమ్మ కాలనీ, నువ్వుల గుంట వీధి, సుందరయ్య కాలనీలలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, బాలికలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీలను కరక సుబ్బలక్ష్మి, గాడి సత్యవతి, రొంగల సుబ్బలక్ష్మి, నమ్రత, అమృత, పూజిత, వరలక్ష్మి, క్రాంతి కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా గోదా దేవి రంగనాథ కల్యాణం

ప్రజాశక్తి - కాజులూరు

గోధా రంగనాధుల కళ్యాణ మహోత్సవం మండలంలోని కోలంక గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. కేశవ స్వామీ ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు వింజరపు సత్యనారాయణాచార్యులు, సుదర్శనం పవన్ కుమార్ అధ్వర్యంలో వరదా సోమేశ్వర వరుణ్ హన్సిక దంపతులచే నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వరదా శేషారావు మాట్లాడుతూ లోక కళ్యాణర్థం గ్రామ సౌభాగ్యం కొరకు ప్రతీ సంవత్సరం భోగి పండగ రోజున ఈ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోటికలపూడి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక రచనలతో విజ్ఞాన సమాజం

ప్రజాశక్తి - కాజులూరు

వైజ్ఞానిక వాస్తవికత రచనలతో విజ్ఞాన సమాజం ఏర్పడుతుందని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణ అన్నారు. మండలంలోని పల్లిపాలెంలో ఆదివారం జరిగిన మధునాపంతుల సూరయ్య శాస్త్రి శతజయంతి ఉత్సవాలలోఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణకు, విజయ వాడకు చెందిన ఆయుర్వేద వైద్యులు రచయిత డాక్టర్ జీవి పూర్ణచంద్‌కు 'ప్రతిభా పురస్కారం' అందజేశారు. దాట్ల దేవదానం రాజు, కిరణ్ మధునాపంతుల, పిఆర్ఎల్ స్వామి, రవిశంకర్ రెడ్డి, గోవిందరెడ్డి తదిత రులకు ఆత్మీయ సత్కారం చేశారు. మధునా పంతుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరి గిన సభలో డాక్టర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ, సాహిత్యంలో రెండు పాయల్లో ఒకటైన భావుక - కాల్పనిక సాహిత్యంలో వచ్చినంత ఎక్కువగా వైజ్ఞానిక - వాస్తవిక సాహిత్యంలో రచనలు రాకపోవడం పెద్ద లోటు అని అన్నారు. చరిత్ర, సైన్సు, టెక్నాలజీ, మెడికల్ రంగాలలో రచనలు ప్రజల జీవితాలను గుణాత్మకంగా మారుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలపతి, మధునా మూర్తి ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.